సాక్షి ఒడిశా

బుధవారం । 27 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,23,781లు, బంగారం 4 గ్రాముల 200 మిల్లీగ్రాములు వెండి 105 గ్రాముల 350 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సభ వాయిదా

రాష్ట్ర శాసనసభ బుధవారానికి వాయిదా పడింది. కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టారు.

- 8లో.



కళలకు పునరుజ్జీవం

కొరాపుట్ పర్వ్ ఆదివాసీ కళలను పరిరక్షిస్తోంది. కళల ప్రదర్శన ఆకట్టుకుంది.

- 8లో.

న్యూస్‌రీల్

ఘనంగా రాజ్యాంగ వ్యవస్థాపక దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక సివిల్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం రాజ్యాంగ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు, జడ్జిలు ఈ కార్యక్రమంలో పాల్గొని శపథం చేశారు. జిల్లా జడ్జి సత్యనారాయణ షాడంగి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: జిల్లాలోని టికిరి ప్రాంతం నుంచి కర్రల లోడుతో జేకే పేపర్ మిల్ వైపు వస్తున్న లారీ అదుపుతప్పి గుమ్మా ఘాటీ మలుపు వద్ద బోల్తా పడింది. సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి లారీ డ్రైవర్, హెల్పర్లకు స్వల్పగాయాలు తగిలాయి. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు ఘటన స్థలంకు చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి చికిత్స కోసం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల వివరాల తెలియాల్సి ఉంది.

వలస కార్మికుడి మృతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితికి చెందిన మరో వలస కార్మికుడు కేరళ రాష్ట్రంలో మృతి చెందాడు. మృతుడు కాసీపూర్ ప్రాంతానికి చెందిన సింధూరఘాటి పంచాయతీలోని సనొ చెకన గ్రామానికి చెందిన హరపూల్ మాఝి(34) గా గుర్తించారు. ఇటీవల దసరా పూర్తయిన తర్వాత తోటి స్నేహితులతో కలిసి ఉపాధి కోసం కేరళలోని త్రిసూర్ వెళ్లాడు. ఈ క్రమంలో పనులను నిర్వర్తించుకుని త్రిసూర్‌లో ఉంటున్న తమ గదికి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన సమాచారాన్ని తోటి స్నేహితులు మాఝి కుటుంబానికి తెలియజేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు బాధితుని కుటుంబీకులు జిల్లా కార్మిక, ఉపాధి కార్యాలయానికి వేడుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా అంత దూరం నుంచి తాము మృదేహాన్ని తీసుకు వచ్చే స్తోమత లేకపోవడంతో ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు అందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

అవినీతి ఆరోపణలపై ఫారెస్టర్ అరెస్టు



అరెస్టయిన ఫారెస్టర్, గ్రామ సాథీ

జయపురం: ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు స్వాహా చేసిన ఆరోపణపై కుంద్ర సమితి ఫారెస్టు రేంజ్‌లో ఫారెస్టర్ రమేష్ చంద్ర భొత్రతో పాటు గ్రామ సాథీ మహేంద్ర ఖొరలను అరెస్టు చేసినట్లు జయపురం విజిలెన్స్ వర్గాలు మంగళవారం వెల్లడించారు. వారిపై ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభించటంతో అరెస్టు చేసి జయపురం స్వతంత్ర విజిలెన్స్ కోర్టులో హాజరుపరచారు. ఇద్దరినీ కోర్టు డిసెంబర్ 7 వరకు రిమాండ్‌కు పంపించిందని జయపురం విజిలెన్స్ ఎస్పీ ప్రద్యుమ్న కుమార్ ద్వివేది వెల్లడించారు. బాగ్‌దేరీ సెక్షన్ అడవిలో పనులు జరిపేందుకు అటవీ విభాగం నిధులు మంజూరు చేసింది. ఆ పనుల్లో కార్మికులను నియమించినట్లు ఫారెస్టర్, గ్రామ సాథీలు చూపించి రూ.11,44,150 బిల్లు చేశారు. కార్మికుల అకౌంట్‌లలో బిల్లుల ప్రకారం జమ చేశారు. అనంతరం వారు కార్మికుల నుంచి రూ.10,60,125 వసూలు చేశారు. దీంతో కార్మికులు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సంజయ ప్రధాన్ టీమ్ దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో కేవలం రూ.84 వేల విలువైన పనిమాత్రం జరిగినట్లు తేలింది. మిగతా డబ్బు ఫారెస్టర్, గ్రామ సాథీలు కలసి స్వాహా చేసినట్లు వెల్లడి కాగా విజిలెన్స్ కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేసి వారిని స్పెషల్ విజిలెన్స్ కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

రాజ్యాంగం పరమ పవిత్రం



రాజ్యాంగ దినోత్సవం పాదయాత్రలో ముఖ్యమంత్రితో పాల్గొన్న మంత్రులు ఇతర ప్రముఖులు

భువనేశ్వర్: జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం ప్రాముఖ్యత, దాని ప్రాథమిక సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో మంగళవారం స్థానిక ఏజీ స్క్వేర్ నుంచి క్యాపిటల్ ఆస్పత్రి వరకు పాద యాత్ర నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, పలువురు మంత్రులు భారత రాజ్యాంగం చైతన్య పాదయాత్రలో పాల్గొన్నారు. భారతీయులు అందరికీ రాజ్యాంగ దినం పవిత్రమైనదిగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. పాదయాత్రలో భాగంగా ఆయన ప్రసంగించారు. దేశంలో ప్రజా స్వామ్య పాలనకు రాజ్యాంగం మార్గ నిర్దేశక శక్తిగా పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ భారత రాజ్యాంగం జాతీయ దినోత్సవం రాష్ట్ర స్థాయిలో నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానిక ఏజీ స్క్వేర్‌లో రాజ్యాంగ ఆవిష్కర్త డాక్టరు బీఆర్ అంబేడ్కర్ శిలా విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం క్యాపిటలు ఆస్పత్రి వరకు పాద యాత్ర నిర్వహించారు.



భారత రాజ్యాంగంపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన ముఖ్యమంత్రి



క్యాపిటల్ ఆస్పత్రి పరిసరాల్లో చెత్త ఊడ్చిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

రాజ్యాంగ సూత్రాలు అనుసరిస్తాం



భారత రాజ్యాంగం జాతీయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాసన సభ సముదాయంలో రాజ్యాంగ విలువల పరిరక్షణకు కట్టుబడి పాలన కొనసాగిస్తామని మంత్రి మండలి సభ్యులు ప్రతిన బూనారు. శాసన సభ స్పీకరు సురమా పాఢి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రితో సహా ఇతర మంత్రులు, విపక్ష సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

– భువనేశ్వర్

అదనపు 'పద్దు'పొడుపు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో 2024–25 ఆర్థిక సంవత్సరపు అదనపు బడ్జెటు ప్రవేశ పెట్టారు. ఆర్థిక శాఖ మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ బడ్జెట్ ప్రతిపాదించారు. అనుబంధ బడ్జెటు పరిమాణం రూ. 12,156 కోట్లు.

కొత్త ప్రతిపాదనలు

సభలో ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరపు అనుబంధ బడ్జెటులో ప్రవాస భారతీయ దివస్ పాలన, కేంద్ర సాయుధ పోలీసు దళం మోహరింపు, పోలీసు ఠాణాలు, ఔటు పోస్టులో సీసీటీవీ నిఘా వ్యవస్థ, పూరీ శ్రీ జగన్నాథుని రత్న భాండాగారం కార్యకలాపాల వ్యయం కొత్తగా జోడించిన అనుబంధ ప్రతిపాదనలుగా పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో పూరీ శ్రీ జగన్నాథుని రత్న భాండాగారం కార్యకలాపాల కోసం రూ. 5 కోట్లు వ్యయం ప్రతిపాదించారు. శ్రీ జగన్నాథుని రథ యాత్రలో సాధారణ భక్తులు, యాత్రికుల్ని రథాలపైకి నివారించడంతో దైతపతి సేవాయత్‌లకు పరిహారం చెల్లించేందుకు రూ.12 కోట్లు, శ్రీ జగన్నాథుని పాడి ప్రసాదం పంపిణీ కోసం రూ. 15 కోట్లు, నగరంలో ప్రవాసి భారతీయ దినోత్సవం కోసం రూ.125 కోట్లు, సీఏపీఎఫ్ మోహరింపు కోసం రూ. 299 కోట్లు, పోలీసు ఠాణాలు, ఔటు పోస్టుల్లో సీసీటీవీ కెమెరా వ్యవస్థ కోసం రూ. 51 కోట్లు, శ్రీ మందిర్ ప్రాకారం విస్తరణ వ్యయ ప్రణాళిక రూ. 26 కోట్లు, అగ్ని మాపక వ్యవస్థ ఆధునికీకరణ, విస్తరణ కోసం రూ. 120 కోట్లు, వరదల నియంత్రణ, మురికి నీటి ప్రవాహ వ్యవస్థ నిర్వహణ కోసం రూ. 66 కోట్లు, మధు బాబు ఫించను పథకానికి రూ. 338 కోట్లు, గోపబంధు జన ఆరోగ్య యోజన కోసం రూ. 644 కోట్లు, సుభద్ర యోజన కోసం రూ. 1,196 కోట్లు, అధికారిక పాలన వ్యవహారాల కోసం రూ. 1,685 కోట్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కోసం రూ. 15 కోట్లు, రాష్ట్ర శాసన సభ భవనం నిర్మాణం కోసం రూ. 6 కోట్లు, సిబ్బంది రాష్ట్ర బీమా ఈఎస్‌ఐ ఔషధ కొనుగోలు కోసం రూ. 15 కోట్లు, ఒడిశా మాధ్యమిక విద్యా బోర్డు కోసం రూ. 13 కోట్లు, ఎత్తిపోతల నీటి పథకం కోసం రూ.20 కోట్లు, 22 ఐటీఐ ప్రాంగణాల్లో ఉత్కర్ష కేంద్రాల ఏర్పాటు కోసం రూ.130 కోట్లు, ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కోసం రూ. 92 కోట్లు, నియోజక వర్గాల వారీగా కనీస అవసరాల కోసం రూ. 142 కోట్లు 2024–25 ఆర్థిక సంవత్సరపు అనుబంధ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

రైతు సంక్షేమం, ఆహార భద్రత

అనుబంధ బడ్జెటులో రైతు సంక్షేమం, ఆహార భద్రత కోసం ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. వ్యవసాయ ఉత్పాదనల సేకరణ, నిల్వ ప్రక్రియ నిర్వహణ కోసం రూ. 59 కోట్లు, గ్రామాల వారీ ఖరీఫ్ సీజనులో వరి సాగు కోసం రూ. 6 కోట్లు, రాష్ట్రీయ పశు ధన్ వికాస్ యోజన కింద శ్వేత విప్లవం కోసం రూ. 91 కోట్లు నిధులు కేటాయించారు.

మునిగుడలో అండర్ గ్రౌండ్ నిర్మాణానికి సన్నాహాలు

రాయగడ: మునిగుడలో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద అండర్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కొద్ది రోజుల క్రితం మునిగుడలో గల ప్రగతి మంచ్ ఆధ్వర్యంలో వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు, ప్రగతి మంచ్ సభ్యులు, వ్యాపార, వాణిజ్య సంఘాలు అండర్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్పందించిన రైల్వే శాఖ మంగళవారం నాడు రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద అండర్ గ్రౌండ్ ఏర్పాటుకు సంబంధించి సర్వే నిర్వహించింది. ప్రగతి మంచ్ సభ్యులు ఈ సందర్భంగా రైల్వే యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.



లెవెల్ క్రాసింగ్ వద్ద సర్వే చేస్తున్న రైల్వే సిబ్బంది

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి సాగును ధ్వంసం చేస్తున్న పోలీసులు



గంజాయి సాగు



గంజాయిని కాల్చి వేస్తున్న దృశ్యం

రాయగడ: గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపిన పోలీస్ జిల్లా యంత్రాంగం ఆ దిశగా దాడులు నిర్వహిస్తోంది. డ్రోన్‌ల సహాయంతో ముందస్తుగా సమాచారం తెలుసుకుంటోంది. మంగళవారం జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చంద్రపూర్ సమితి పరిధిలో గల సిరిపూర్, సనపంకాల్ అటవీ ప్రాంతంలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయి సాగును పోలీసులు ధ్వంసం చేశారు. అనంతరం మొక్కలను తగలబెట్టారు.

రూ.5కోట్లు విలువైన గంజాయి ధ్వంసం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి బడపోధర్ పంచాయతీ కంధగూఢ గ్రామంలోని 35 ఎకరాల్లో సాగు చేస్తున్న 55,000 వేల గంజాయి మొక్కలను నరికి కాల్చేశారు. చిత్రకొండ ఎక్సైజ్ పోలీసులు, డీవీఎఫ్ జవాన్లు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ గంజాయి విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటుంది.

నాసిరకం బియ్యం సరఫరా!



అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన బియ్యం బస్తాలు

రాయగడ: అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం బియ్యం సరఫరా కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని కాసీపూర్ సమితిలో పురుగు పట్టిన రేషన్ బియ్యాన్ని డిపోకు పంపించడంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరించారు. వెంటనే స్పందించిన జిల్లా అధికారులు ఆ బియ్యాన్ని తిరిగి తీసుకుని మిల్లుకు తరలించారు. అక్కడ శుభ్రపరిచిన అనంతరం తిరిగి డిపోకు పంపించారు. కొద్ది నెలలుగా జిల్లాలో గల రేషన్ డిపోలతోపాటు తాజాగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గల 27 అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బియ్యంలో కూడా పురుగులు ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. బియ్యంలో పురుగులు ఉన్నప్పటికీ అధికారులు కనీసం వాటి నాణ్యతను పరిశీలించకుండా డిపోలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు తరలిస్తుండటంతో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే నాసిరకం బియ్యాన్ని వెనక్కు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మహేంద్రగిరిలో ఏడు ఎకో రిసార్టులకు బుకింగ్ ప్రారంభం



మహేంద్రగిరి పర్వతం వద్ద ఎకో కాటేజీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ ఆనంద్

పర్లాకిమిడి: పవిత్ర మహేంద్రగిరి పర్వతం వద్ద పర్యాటకుల కోసం నిర్మించిన ఏడు ఎకో రిసార్టులు, మూడు డార్మిటరీలు ఈనెల 25 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయని జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ విలేకరులతో తెలిపారు. స్థానిక డీఎఫ్ఓ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మహేంద్రగిరి ఎకో కాటేజీలో ఒకరోజు పర్యాటకులు ఉండటానికి రోజుకు రూ.4,333 ధర నిర్ణయించామని, డార్మిటరీల ధర ఇంకా ఖరారు కాలేదని అన్నారు. ప్రతి పర్యాటకునికి అన్నివిధాలా సౌకర్యాలతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న లంచ్, రాత్రి డిన్నర్ ఉంటాయని తెలిపారు. ఆధ్యాత్మిక పవిత్ర స్థలంలో కేంద్ర ప్రభుత్వం 7 కాటేజీలు నిర్మించిందని, కనీసం 15 మంది ఈ కాటేజీలలో ఉండవచ్చని అన్నారు. అయితే ఈ కాటేజీలలో వెజిటేరియన్ ఫుడ్ మాత్రమే ఉంటుందన్నారు. ప్రకృతి అందాలు, బయోడైవర్సిటీ, కుంతీ, యుధిస్టర, భీం, పరశురాం కుండ్‌లు సందర్శించి వింత అనుభూతి పొందవచ్చని డీఎఫ్ఓ ఆనంద్ అన్నారు.



రాత్రివేళ మహేంద్రగిరిలో కాటేజీలు



రాత్రివేళ మహేంద్రగిరిలో కాటేజీలు

బీజేపీకి ఓటు వేయనందుకు వెలివేత



నిరసన తెలుపుతున్న బాధితులు

● బాధిత కుటుంబాల నిరసన

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార పక్షం భారతీయ జనతా పార్టీకి ఓటు వేయలేదన్న ఆక్రోషంతో గ్రామం నుంచి వెలివేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత కుటుంబాలు తమ గోడుని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లినా స్పందించకపోవడంతో, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన ప్రదర్శించారు. దీంతో ఈ ఉదంతం బట్టబయలైంది. రాజకీయ కక్షతో గ్రామస్తులను సామాజిక బహిష్కరణకు గురి చేసిన సంఘటన పూరీ జిల్లా నిమాపడా మండలం పాలశ్రీ గ్రామంలో చోటు చేసుకుంది. భారతీయ జనతా పార్టీకి ఓటు వేయలేదని పాలశ్రీ గ్రామంలోని 4 కుటుంబాలకు సామాజిక బహిష్కరణకు గురి చేశారు. ఈ కుటుంబాల్లో సుమారు 20 మంది సభ్యులు గత కొద్ది నెలలుగా ఈ వెలివేత వేధింపుల మధ్య సతమతం అవుతున్నారు.

ఓటు వేయాలని ఒత్తిడి

గత ఎన్నికల్లో కొంతమంది వ్యక్తులు భారతీయ జనతా పార్టీకి ఓటు వేయాలని వీరిపై ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడికి తలొగ్గకుండా స్వేచ్ఛగా స్వీయ అభీష్టం మేరకు ఓటు వేశారు. దీంతో ఓటు వేయాలని ఒత్తిడి తెచ్చిన వర్గం ప్రస్తుతం పలు రకాల బెదిరింపులతో హెచ్చరిస్తున్నారు. ఈ వేధింపులు తాళలేక బాధిత వర్గం పూరీ జిల్లా కలెక్టర్‌ని సంప్రదించి తమ గోడుని విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో మన్మోహన్ ప్రధాన్ ఆధ్వర్యంలో వెలివేత ఎదుర్కొంటున్న మరో 3 కుటుంబాల ప్రతినిధులు నిరసన ప్రదర్శనలో పాలుపంచుకున్నారు. వీరి కుటుంబాలకు గ్రామంలో సామాజిక బహిష్కరణ అమలు చేసి వంటా వార్పునకు వీలు లేకుండా నీరు, నిప్పు వంటి సౌకర్యాలు బలవంతంగా దూరం చేశారు. చివరకు గ్రామంలోని దేవాలయంలోనికి సైతం ప్రవేశించకుండా అడ్డగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు నిరసన ప్రదర్శనకు దిగడంతో నిమాపడా తహసీల్దార్ స్పందించారు. వీరి ఆరోపణపై తక్షణమే విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు న్యాయం చేయకుంటే గత్యంతరం లేని పరిస్థితుల్లో తామంతా సామూహికంగా ఆత్మాహుతికి పాల్పడతామని బాధితులు హెచ్చరించారు.

కేంద్ర విధానాలపై ఆందోళన



కేంద్ర ప్రభుత్వ రైతులు,శ్రామిక వర్గాలకు విధానాలకు వ్యతిరేకంగా గజపతి కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు



గజపతి కలెక్టరేట్‌కు మూకుమ్మడిగా వెళ్తున్న కిసాన్ మోర్చా నాయకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి కొత్త బస్టాండ్ నుంచి సంయుక్త రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో కృషక్ మోర్చా సర్వభారతీయ రైతుల పిలుపు మేరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం గజపతి కలెక్టరేట్ వద్ద భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ మూడు నల్లచట్టాలు వెనక్కి తీసుకోవాలని, రైతు రుణమాఫీ, ఉపాధి కూలీలకు కనీస దినసరి కూలీ రూ.600లు పెంచాలని కోరారు. వ్యవసాయ కూలీలకు పింఛన్ ఇళ్ల మంజూరు వంటి తదితర డిమాండ్లు ఇంతవరకూ నెరవేరలేదని ఆయన అన్నారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ కార్యదర్శి కేదార్ శొబోరో, ఒడిశా కృషక్ సభ (ఏ.ఐ.కె.యస్.) జిల్లా కార్యదర్శి నర్సింహా మండళ్, ఆల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ జిల్లా కార్యదర్శి పి.మురళీకృష్ణ, జిల్లా రైతుకూలీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రోక్కం లోకనాథం, తదితరులు వ్యవసాయ కార్మికుల పలు డిమాండ్లతో కూడిన వినతిని డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండాకు అందజేశారు.

క్లుప్తంగా

జయపురంలో రాజ్యాంగ దినోత్సవం

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు కోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన ముఖ్యఅతిథిగా పాల్గొని రాజ్యాంగం పై ప్రసంగించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కొత్త బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు.

మహిళా డిగ్రీ కళాశాలలో...

పర్లాకిమిడి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక మహిళా స్నాతక కళాశాలలో మంగళవారం డాక్టర్ రీనాసాహు అధ్యక్షతన నిర్వహించారు. రాజ్యాంగం గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వక్తృత్వ, ప్రబంధ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. వీటిలో విజేతలైన కె.పి.అశ్వినీ, మధుస్మితా ప్రధాన్, చాందినీ బెహరా, రాధికా, జయలక్ష్మీ, బిశ్వజిత్ మల్లిక్, మనిషా కార్జి, సౌమ్యలిమ్మా తదితరులకు బహుమతి ప్రదానం చేశారు.

'అర్హులకు ఇళ్లు కేటాయించాలి'



సబ్ కలెక్టర్‌ను కలసి మెమోరాండం సమర్పించిన కాటపాడ పంచాయతీ ప్రజలు

జయపురం: ఆవాస పథకంలో అర్హులకు ఇళ్లు కేటాయించాలని బొయిపరిగుడ సమితి కాటపాడ పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ గ్రామ పంచాయతీ ప్రతినిధులు జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డిని కలిసి మెమోరాండం సమర్పించారు. తమ గ్రామ పంచాయతీలో నిబంధనలను తుంగలో తొక్కి అర్హులు కాని వారికి ప్రధాన మంత్రి అవాస పథకంలో ఇళ్లు కేటాయిస్తున్నారని వారు ఆరోపించారు. తమ ఆరోపణపై దర్యాప్తు జరిపి అర్హులైన వారికి ఆ పథకంలో చేర్చాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారుడికి కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హర్యానా రాష్ట్రం పంచ్‌కులా వేదికగా ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు జరగనున్న 38వ జాతీయ సబ్ జూనియర్ కూర్గీ, 13వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన జామి సాక్షిత్ ఎంపిక కావడం పట్ల కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం అభినందించారు. ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సాక్షిత్ స్వర్ణ పతకం సాధించాడు. అదే పోటీలకు జాతీయ రిఫరీగా శ్రీకాకుళం నగరానికి చెందిన తైక్వాండో కోచ్ మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు నౌపడ విజయ్‌కుమార్, వాండ్రంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా

నరసన్నపేట: సంప్రదాయ ఇంధన వనరులను వినియోగించుకుని కాలుష్యాన్ని నియంత్రించాలని, దీనిలో భాగంగా రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా కోరారు. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి సోలార్ విద్యుత్ పరికరాలను రాయితీపై మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నరసన్నపేటలోని మారుతీనగర్‌లో జామి వెంకటరావు ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ పరికరాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. విద్యుత్ శాఖ ఏడీ ఇందిర మాట్లాడుతూ మండలంలో 62 దరఖాస్తులు వచ్చాయని, 18 మంది డబ్బులు చెల్లించారని తెలిపారు. తొమ్మిది చోట్ల సోలార్ పరికరాలు అమర్చామని వివరించారు. ఎంపీడీఓ మధుసూదనరావు, ఏఈ కోటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కనీసం ఇద్దరు వినియోగదారులకు సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ పరికరాలు అమర్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.



పర్వ్ ఉత్సవంలో ఆదివాసీ కళాకారుల నృత్యం



పర్వ్ ఉత్సవాల్లో పాల్గొన్న జన సంద్రం



బహుమతులు అందుకుంటున్న గదబ నృత్య కళాకారులు

ఆదివాసీ కళలకు పునరుజ్జీవం

జయపురం:

ఆధునికత కారణంగా ఆదివాసీల ప్రాచీన కళలు మరుగున పడుతున్నాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడానికి జాతీయ స్థాయి ఆదివాసీ మహోత్సవం కొరాపుట్ పర్వ్ దోహదపడుతుందని ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ అన్నారు. దేవమాలి పర్వతంపై పొట్టంగి సమితి స్థాయి కొరాపుట్ పర్వ్ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆదివాసీలకు కళలు పుట్టుకతోనే వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రజలు తమ సంప్రదాయ నృత్య విన్యాసాలతో ఉర్రూతలూగించారు. ఉత్సవాల్లో ప్రముఖ ఆదివాసీ నేత మాజీ మంత్రి జయరాం పంగి, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల కుమార్ పంగి, గోపాల కృష్ణ బెవర్త, బీడీఓ, పోలీసు అధికారులు, సర్పంచ్‌లు సమితి సభ్యులు, వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.



ఆదివాసీ మహిళా కళాకారులతో ఎమ్మెల్యే తదితర అతిథులు

చెరువులో మునిగి బాలుడు మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి టిగాల్ పంచాయతీ ఎంవీ 45 గ్రామంలో మంగళవారం ఐదేళ్ల బాలుడు గ్రామంలోని చెరువులో పడి మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లడంతో కుమారులు ఇద్దరూ ఇంటి వద్దే ఉండిపోయారు. అంతా వీధిలో ఆడుతుండగా చిన్న కుమారుడు చెరువులో పడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో మధ్యాహ్నం వరకు అతని ఆచూకీ తెలియరాలేదు. ఇంటి వారు వెతకగా చెరువులో తేలుతూ కనిపించాడు. బయటకు తీసి చూసేసరికి ప్రాణాలు లేవు. దీనిపై సమాచారం అందుకున్న ఎంవీ 79 పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బులు పట్నాయిక్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద బాలుడి మృతదేహం

'స్మార్ట్ మీటర్లతో దోచుకుంటున్నారు'



ఆందోళన చేస్తున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

రాయగడ: స్మార్ట్ మీటర్ల పేరిట విద్యుత్ వినియోగదారులను టీపీఎస్ ఓడీఎల్ ప్రైవేట్ సంస్థ నిలువునా దోచుకుంటోందని అమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరిట ఒక వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయానికి ఆ పార్టీ నాయకుడు జన్మాజయ్ స్వాయి అందజేశారు. రాష్ట్రంలో ఈ సంస్థ గుత్తాధిపత్యం తీసుకున్న తర్వాత స్మార్ట్ మీటర్ల పేరిట అధిక విద్యుత్ ఛార్జీలను వసూళ్లు చేస్తోందని, దీనిని నివారించాలని డిమాండ్ చేశారు.

ముందుగా డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ఆ పార్టీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం మంది ఆదివాసీ, హరిజనులు నివసిస్తున్నారని, అందువలన నెలకు కనీసం మూడు వందల యూనిట్లను ఉచితంగా అందజేయాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడి



ర్యాలీలో పాల్గొన్న ట్రేడ్ యూనియన్ల నాయకులు

రాయగడ: సంజుక్త కిషాన్ మోర్చా ఆధ్వర్యంలో వివిధ ట్రేడ్ యూనియన్లు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. స్థానిక ఐబీ నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి పేరిట ఒక వినతిపత్రం సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఔషధాలు, వ్యవసాయ ఉత్పత్తులు వంటి వాటిపై జీఎస్టీ మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి గొమాంగో, ఐఎన్‌టీయూసీ నాయకుడు భవానీ జెన్న, హరిచందన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష తులసీదళార్చన



రాయగడ: కార్తీక మాసంలో వచ్చే ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రాహ్మణ వీధిలో గల కోదండరామ మందిరంలో లక్ష తులసీ పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత ఆచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోదండరామునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయిమందిరం అర్చకులు పి.మురళీకృష్ణ, తదితరులు పాల్గొని విశేష పూజలు చేపట్టారు.

కొత్త బస్టాండ్‌లో బస్సులు ప్రారంభం

జయపురం: జయపురంలోని కొత్త బస్టాండ్‌లో సోమవారం రాత్రి నుంచి బస్సులు నడిచేందుకు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కలెక్టర్ కీర్తి వాసన్ పచ్చజెండా ఊపారు. ముందుగా బస్టాండ్‌కు రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. నేటి నుంచి అన్ని బస్సులు ఇక్కడి నుంచే నడుస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రైవేటు బస్సులు కూడా ఇక్కడి నుంచి నడిచేందుకు నిర్ణయం తీసుకున్నారు.

కార్యక్రమంలో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ శ్రీమతి బి.సునీత, సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డి, సబ్‌డివిజనల్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



కొత్త బస్టాండ్‌లో బస్సు వెళ్లేందుకు పచ్చ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పదాల తొలగింపు అవమానకరం: బీజేడీ



శాసన సభలో శాంతియుతంగా నిరసన ప్రదర్శించిన విపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు.

భువనేశ్వర్: జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర శాసన సభలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన భారత రాజ్యాంగం ఉపోద్ఘాత పత్రంలో సెక్యులర్, సోషలిస్టు రెండు పదాలు వైదొలగించడంపై విపక్ష బిజూ జనతా దళ్ తీవ్రంగా విరుచుకు పడింది. శాసన సభ శీతాకాలం సమావేశాల్లో విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ సభ్యులు ఎవరి స్థానంలో వారు నిలబడి శాంతియుతంగా నిరసన ప్రదర్శించారు. అఠొగొడొ నియోజక వర్గం ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వయి ఈ నిరసనకు సారథ్యం వహించారు. భారత రాజ్యాంగం ఉపోద్ఘాతం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాల్ని తొలగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. మర్నాడే రాష్ట్ర శాసన సభలో ప్రదర్శించిన రాజ్యాంగం ఉపోద్ఘాత పత్రంలో ఈ రెండు పదాలు కనుమరుగు కావడం అత్యంత విచారకరమని రణేంద్ర ప్రతాప్ స్వయి ఆక్షేపించారు. ఈ నిరసనకు కాంగ్రెసు సభ్యులు కూడ మద్దతు ప్రకటించి బీజేడీ సభ్యుల తరహాలో ఎవరి స్థానంలో వారు నిలబడి నిరసన ప్రదర్శించారు.

జాతీయ పోటీల్లో పవన్ సాయి ప్రతిభ

రణస్థలం: జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ క్రీడా పోటీల్లో రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మామిడి పవన్‌సాయి సత్తా చాటాడు. ఈ నెల 19 నుంచి 21 వరకు జమ్మూకాశ్మీర్‌లో జరిగిన పోటీల్లో 70-75 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు, గతంలో రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పవన్‌సాయిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

విధులకు ఆటంక పరిచాడంటూ ఎస్ఐ ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : విధుల్లో ఉన్న తనను ఆటంక పర్చాడంటూ సాయంకాల పత్రికా విలేకరి పవన్‌పై శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ-2 రామారావు అదే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 353 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ రాత్రి దమ్మలవీధికి చెందిన వ్యక్తితో వాగ్వాదం, దాడి జరుగుతుండగా సిబ్బందితో వెళ్లిన తనను పవన్ అడ్డుపడి విధులకు తీవ్రంగా ఆటంకపర్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా, ఇల్లు నిర్మించుకునేటప్పుడు డబ్బులు డిమాండ్ చేశారనే కారణంతో ఇప్పటికే పవన్‌పై ఓ దళిత మహిళ (రేజేటి శిరీష) ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టింది.

శుద్ధజలం సరఫరా చేయండి

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి బుడాగుడ గ్రామంలో గల 9, 10వ వార్డుల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి కుళాయిల నుంచి వస్తున్న నీరు బురదమయంగా ఉండటంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని సమితి కార్యాలయానికి మంగళవారం వెళ్లి అసిస్టెంట్ ఇంజినీర్ సవ్యసాచి నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ రెండు వార్డుల పరిధిలో సుమారు 700 మందికి పైగా జనాభా నివసిస్తున్నారన్నారు. ఈ విషయమై అధికారులు చొరవ తీసుకుని శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.



అసిస్టెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

రాజ్యసభ ఉప ఎన్నిక నోటిఫికేషన్

భువనేశ్వర్: రాష్ట్రంలో రాజ్యసభ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ ఉత్తర్వు ప్రకారం రాష్ట్రం నుంచి ఖాళీ అయిన ఒక స్థానం భర్తీకి ఉప ఎన్నిక జరుగుతుంది. బిజూ జనతా దళ్ అభ్యర్థి సుజిత్ కుమార్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఆయన బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన ఈ స్థానం ఖాళీ అయింది. వాస్తవానికి సుజిత్ కుమార్ పదవీ కాలం 2026 సంవత్సరం ఏప్రిల్ 2వ తేదీతో ముగియాల్సింది.

ఎన్నికల షెడ్యూల్

నామినేషన్ల ప్రక్రియ	డిసెంబర్ 3
నామినేషన్ దాఖలు ముగింపు	డిసెంబర్ 10
నామినేషన్ దస్తావేజుల పరిశీలన	డిసెంబర్ 11
నామినేషన్ విత్ డ్రా	డిసెంబర్ 13
ఉప ఎన్నిక	డిసెంబర్ 20
పోలింగ్ సమయం	ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
ఓట్లు లెక్కింపు	డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు
ఉప ఎన్నిక ప్రక్రియ ముగింపు	డిసెంబర్ 24



స్పీకరు పోడియం చుట్టుముట్టిన కాంగ్రెసు సభ్యులు

సభ వాయిదా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో శీతాకాలం సమావేశాలు వేడి వేడిగా ఆరంభమయ్యాయి. దివంగత సభ్యులకు సంతాపం ప్రకటించాక అకస్మాతుగా సభలో వాడి వేడిగా వాగ్యుద్ధం జరిగింది. సభా కార్యక్రమాల్ని సజావుగా నిర్వహించేందుకు ప్రతికూల పరిస్థితులు తలెత్తడంతో అంచెలంచెలుగా స్పీకరు సభా కార్యక్రమాల్ని వాయిదా వేశారు. సభా కార్యక్రమాలు ప్రారంభం కావడంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాప తీర్మానం ప్రతిపాదించారు. అఖిల పక్షాలు మద్దతు ప్రకటించి కాసేపు మౌనం ప్రదర్శించి దివంగత సభ్యుల ఆత్మ శాంతికి ప్రార్థించారు. ఈ సందర్భంగా సమీర్ దే, ధనేశ్వర్ మాఝి, మకరధ్వజ ప్రధాన్, నిరంజన్ ప్రధాన్, ఉత్కళ కేశరి పరిడా, పూర్ణ చంద్ర మాఝి మృతిపై సంతాప తీర్మానం ప్రతిపాదించారు.

కార్యక్రమం ముగియడంతో ప్రశ్నోత్తరాల నిర్వహణ కోసం స్పీకర్ సురమా పాఢి ఆదేశించారు. స్పీకరు ఆదేశాల మేరకు మంత్రి రబి నాయక్ సిద్ధం అయ్యే తరుణంలో కాంగ్రెస్ సభ్యుల రభస జరిగింది. మామిడి టెంకల జావతో రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన మృత్యు సంఘటనపై న్యాయ విచారణకు కాంగ్రెసు సభ్యులు డిమాండ్ చేశారు. దీనిపై ప్రశ్నోత్తరాల తర్వాత చర్చించేందుకు అవకాశం ఉంటుందని స్పీకరు సర్దుబాటు చేసేందుకు విఫలయత్నం చేశారు. స్పీకరు సూచనను కాంగ్రెసు సభ్యులు వ్యతిరేకించి పోడియం చుట్టుముట్టారు. ఈ పరిస్థితుల్లో తొలుత మధ్యాహ్నం 11.30 గంటల వరకు తదుపరి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మరోసారి సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేసిన పరిస్థితి కుదుట పడకపోవడంతో సభని బుధవారం నాటికి వాయిదా వేశారు.

విపత్తును ఎదుర్కొనే సదుపాయాలు అవసరం: సీఎం

భువనేశ్వర్: రాష్ట్రంలో తరచూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం పరిపాటి. ఇలాంటి సందర్భాల్లో నష్ట నివారణపై చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కేంద్ర ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో ఇటీవల బీభత్సం సృష్టించిన దానా తుపాను నష్టం అంచనా వేసేందుకు కేంద్రం నుంచి అంతర్ మంత్రి మండలి రాష్ట్రానికి విచ్చేసింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఈ బృందం ప్రత్యక్షంగా సందర్శించింది. నష్టం అంచనాతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో మంగళవారం ముఖాముఖి సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విపత్తు నిర్వహణకు సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలకమైన ప్రతిపాదనల్ని ఈ బృందానికి ప్రతిపాదించారు. కేంద్రం నుంచి నిధుల మంజూరు ఇతర సహకారాలు అందజేయాలని అభ్యర్థించారు.

తుపాను, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు, పాడి పశువుల ప్రాణాల్ని కాపాడగలుగుతున్న పలు మౌలిక సదుపాయాల వ్యవస్థని పరిరక్షించలేకపోతున్నట్లు నష్టం అంచనా కమిటీకి వివరించారు. తరచూ పలు రకాల విపత్తులు కబళిస్తున్నందున కుప్ప కూలిన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ కోసం భారీ స్థాయిలో నిధుల్ని వెచ్చించడం అనివార్యమవుతోంది. ఈ పరిస్థితుల నుంచి బయట పడేందుకు సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రణాళికతో కేంద్రం సహాయం ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తీర ప్రాంతాల్లో మడ అడవుల పెంపకం ప్రోత్సాహం, భూగర్భ విద్యుత్ పంపిణీ వ్యవస్థ, బలమైన ఆనకట్టల నిర్మాణం వంటి కార్యాచరణకు నడుం బిగించడం అనివార్యంగా పేర్కొన్నారు. భువనేశ్వర్ కేంద్రంగా అత్యాధునిక విపత్తు నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రతినిధి బృందానికి ప్రతిపాదించారు.



ముఖ్యమంత్రితో సమావేశమైన దానా తుపాను నష్టం అంచనా కేంద్ర ప్రతినిధి బృందం

ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి మాట్లాడుతు తీర ప్రాంతాల్లో తుపాను, వరదలు వంటి విపత్తుల్ని తట్టుకోగలిగే ఇండ్ల నిర్మాణం, విపత్తు నిర్వహణ, సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల్లో ముందంజ పాత్ర పోషిస్తున్న ఒడిశా విపత్తు స్పందన ఒడ్రాఫ్ వ్యవస్థని అత్యాధునిక సౌకర్యాలతో మరింత పటిష్టపరచడం ఆపత్కాలంలో ప్రయోజనకరం అవుతుందని వివరించారు.

కేంద్ర హోమ్ శాఖ నుంచి 7 మంది సభ్యుల అంతర్ మంత్రి మండలి ప్రతినిధి బృందం రాష్ట్రంలో దానా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సందర్శించింది. ఈ బృందం ఈ నెల 24వ తేదీ నుంచి పలు ప్రాంతాలు సందర్శించింది. ప్రధానంగా తీవ్ర ప్రభావిత భద్రక్, కేంద్రాపడా, బాలాసోర్ జిల్లాల్లో తుపాను నష్టాన్ని లోతుగా సమీక్షించింది. సమావేశానికి ముఖ్యమంత్రి అదనపు కార్య నిర్వహణ కార్యదర్శి నికుంజ బిహారి ధొలొ, రెవెన్యు - విపత్తు నిర్వహణ విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనరు దేవరంజన్ కుమార్ సింగ్ హాజరయ్యారు.

క్లుప్తంగా

చెరువులో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని దుప్పాడ గ్రామంలో గల పాపాన చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. దీనిపై స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు రంగంలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ విషయమై ఎస్సై హరిబాబునాయుడు మాట్లాడుతూ సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం చెరువులో లభించిందన్నారు. పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టామని ఎవరూ మృతదేహాన్ని గుర్తుపట్టకపోవడంతో జిల్లా కేంద్రాస్పత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. ముదురునీలం రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, పసుపు రంగు చెక్ తువ్వాలు మృతుడి దగ్గర లభించాయన్నారు. ఎవరైనా గుర్తుపడితే ఫోన్ 9121109419 నంబర్‌ను గానీ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యం

- డిప్యూటీ డీఈవో కె మోహనరావు


పాతరేగ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ బృందం

రామభద్రపురం: విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యమని డిప్యూటీ డీఈవో కె.మోహనరావు అన్నారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని పాతరేగ పాఠశాలను మంగళవారం జిల్లా అకడమిక్ మానిటరింగ్ టీమ్ సభ్యులు డిప్యూటీ డీఈవో కె మోహనరావు, జీసీడీవో పి.మాలతి, ఐఈ కో ఆర్డినేటర్ ఎం.భారతి సందర్శించారు. పాఠశాల రికార్డులతో పాటు తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఇంగ్లీషు, తెలుగు, గణితం సబ్జెక్టులలో పరిశీలించగా తెలుగు, ఇంగ్లీషులలో విద్యార్థులు వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం, లెసన్ ప్లాన్, టీచర్స్ డైరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు కనీసం చదవడం, రాయడం వచ్చే విధంగా దృష్టి పెట్టాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ భారతి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆరికతోట విద్యార్థి సత్తా


రాష్ట్రస్థాయి పోటీలలో సాధించిన కప్పుతో శ్యామ్‌మోహన్

రామభద్రపురం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో రామభద్రపురం మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. చిత్తూరు జిల్లా తిరుపతిలో ఈ నెల 23,24,25 తేదీలలో 8వ తరగతి చదువుతున్న అడపా శ్యామ్‌మోహన్ అండర్ 14బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్‌మోహన్‌ను పాఠశాల హెచ్‌ఎం జీసీహెచ్‌ఎస్ శర్మ, ఉపాధ్యాయులు డి.రామారావు తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురికి స్వల్పగాయాలు

రామభద్రపురం: మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం పూడేసు గ్రామానికి చెందిన హిమరిక పకీర్ భార్య,పిల్లలతో పాటు అదే గ్రామానికి చెందిన మరికొంత మంది కలిసి బొలెరో వ్యాన్‌లో విశాఖపట్నం విహార యాత్రకు వెళ్తున్నారు. సరిగ్గా పెట్రోల్ బంకు వద్దకు బొలెరో వచ్చేసరికి ఎదురుగా వస్తున్న నవత ట్రాన్స్‌పోర్ట్ లారీ ఢీ కొనడంతో పకీర్‌తో పాటు కుటుంబసభ్యులు మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు బాడంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

మూగబోనున్న కుయ్..కుయ్...!

- సమ్మెకు దిగనున్న108 వాహనాల సిబ్బంది
- విధుల్లో 70 మంది ఈఎంటీలు, 70 మంది పైలెట్‌లు
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వ పెద్దలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: అత్యవసర వేళ ఫోన్ అందుకోగానే క్షణాల్లో వాలిపోయే 108 అంబులెన్సు సేవలు నిలిచిపోనున్నాయి. అపరసంజీవనిగా పేరుగాంచిన 108 అంబులెన్సుల సిబ్బంది సమస్యలు కూటమి సర్కార్ పట్టించుకోకపోవడంతో వారు సమ్మెకు దిగనున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని 108 అంబులెన్స్ సిబ్బంది కొద్దిరోజులుగా పాలకులు, అధికారులకు విన్నివిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడంతో ఈనెల 25 నుంచి సమ్మె చేపడతామని 108 అంబులెన్సుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు డీఆర్వో, డీఎంహెచ్‌ఓలకు 10 రోజుల క్రితం సమ్మె నోటీస్ ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో 108 అంబులెన్సులను నిలిపివేయాలని ఉద్యోగులు నిర్ణయించినట్లు సమాచారం.

108 ఉద్యోగుల డిమాండ్లు

- అంబులెన్సు సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలి.
- ఉద్యోగులకు షిఫ్టుల ప్రకారం 8 గంటల పనివేళలు కల్పించాలి.
- సహజంగా, ప్రమాదంలో మరణించిన ఉద్యోగులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు అందించాలి.
- అంబులెన్సులకు శాశ్వత భవనాలు నిర్మించాలి.
- ప్రస్తుత నిర్వహణ సంస్థ నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలి.

సమ్మె నోటీసులు అందజేత

108 ఉద్యోగులు ఈ నెల 25 నుంచి సమ్మె చేపడతామని డీఎంహెచ్‌ఓ, డీఆర్వోకు సమ్మెనోటీసులు ఇచ్చారు. ఉద్యోగులు సమ్మెకు దిగితే ప్రత్యామ్నాయం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.
– నజీర్ హుస్సేన్, 108 జోనల్ మేనేజర్



108 అంబులెన్సు

జిల్లాలో విధుల్లో 140 మంది ఉద్యోగులు

జిల్లాలో 108 అంబులెన్సుల్లో 140 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో 70 మంది పైలెట్‌లు, మరో 70 మంది ఈఎంటీలు ఉన్నారు.

అంబులెన్స్ సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు

జిల్లాలో 108 అంబులెన్స్‌ల అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. 108 సిబ్బంది సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచిస్తూ వైద్య ఆరోగ్యశాఖ, రవాణాశాఖ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయని వాటిని నడిపేందుకు ఆయా మండలాల్లో లభ్యమయ్యే డ్రైవర్లను గుర్తించి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఒక్కో వాహనానికి ఇద్దరు చొప్పున పేర్లు గుర్తించి జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్టీసీలో శిక్షణ పొందిన డ్రైవర్లను గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఉప రవాణ కమిషనర్ మణిశంకర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాపోటీలకు 'ఏకలవ్య' విద్యార్థులు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: జాతీయస్థాయి క్రీడాపోటీలకు గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 22వ రకు అరకువ్యాలీలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో తమ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. బాక్సింగ్ అండర్ 19లో 53 కేజీల బాయ్స్ విభాగంలో తమ పాఠశాల ఫస్ట్ బైపీసీ విద్యార్థి మోహన్‌రావు, యోగాలో అండర్ 14 బాయ్స్ విభాగంలో ఆరోతరగతి విద్యార్థి దినేష్, 7వ తరగతి విద్యార్థి సిద్ధార్థ, వాలీబాల్ క్రీడలో అండర్ 19 బాయ్స్ విభాగంలో ఫస్ట్ బైపీసీ విద్యార్థి బి.విజయ్, ఖోఖో అండర్ 19 గర్ల్స్ విభాగంలో నీలవేణి ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారంతా డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాహుల్ కుమార్ ఉన్నారు.

సమస్యలను ఫిర్యాదు బాక్సులో వేయండి


మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు బాక్సులో తెలిపితే, ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక చట్టాలు, మహిళా భద్రతా చట్టాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించారు. పాఠశాలలో ఓ డ్రాప్ బాక్సును ఏర్పాటుచేసి, ఏమైనా సమస్యలుంటే ఇందులో ఆ ఫిర్యాదులను అందించాలని సూచించారు. అందరూ లక్ష్యాలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలో పలువురు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు,హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


విలపిస్తున్న తల్లి లక్ష్మి


చందు మృతదేహం (ఇన్‌సెట్)లో చందు(ఫైల్)

తెర్లాం: మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మంగళవారం మృతి చెందాడు. తెర్లాంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాంట్రకోను చందు(18) మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా రాజాం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన చందును స్థానికులు, కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లిన వెంటనే మృతిచెందాడు. చందు బొబ్బిలిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడికి తండ్రి నారాయణరావు, తల్లి లక్ష్మి, చెల్లి ఉన్నారు. తండ్రి విశాఖపట్నంలో పని చేస్తుండగా, తల్లి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ పిల్లలిద్దరినీ పెంచుతోంది. ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై బయలుదేరి వెళ్లిన కుమారుడిని లారీ ఢీకొందన్న సమాచారం తెలియడంతో తల్లి కుప్పకూలిపోయింది. గాయపడిన కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న తరువాత తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఎస్సై సాగర్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహానికి కుటుంబసభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శవ పంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

ఏడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



రిలేనిరాహార దీక్షలు చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

సీతంపేట: గిరిజన గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న శాంతియుత రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరాయి. తమ డిమాండ్‌లు పరిష్కరించేవరకు దశల వారీ ఆందోళన తప్పదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, సీఆర్‌టీలుగా మార్పుచేయాలని, డీఎస్సీలో తమ పోస్టులు మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.గణేష్, బి.ధర్మారావు, మోహన్‌రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడిపై నాటుతుపాకీతో దాడి

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి దుగ్గి గ్రామానికి చెందిన బిడ్డిక లక్కాయి అనే గిరిజన వ్యక్తిపై నాటుతుపాకీతో దాడి జరిగింది. బిడ్డిక లక్కాయి భార్యతోపాటు గొర్రెలు మేపేందుకు వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చిన అనంతరం ఆరుబయట కుళాయి వద్ద స్నానం చేస్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న లక్కాయిని వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. తుపాకీ దాడిలో లక్కాయి శరీరంలోకి మూడు బుల్లెట్‌లు చొచ్చుకుపోగా ఒక బుల్లెట్‌ను వైద్యులు సర్జరీ చేసి తీశారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు దుగ్గి గ్రామానికి వెళ్లి విచారణ చేశారు.

సాగునీటి తగాదాలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామం కూనంబందవలస రెవెన్యూ పరిధిలో జరిగిన సాగునీటి తగాదాలో పాచిపెంట మండల కేంద్రానికి చెందిన ఎం.కోటేశ్వరరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై వెంకటసురేష్ తెలిపిన వివరాల ప్రకారం, కోటేశ్వరరెడ్డికి కూనంబందవలస రెవెన్యూ పరిధిలో భూమి ఉంది. పక్కనే పాంచాలి గ్రామానికి చెందిన సనాపతి బంగారురాజుకు భూమి ఉంది. వారిద్దరి మధ్య తరచూ సాగునీటి విషయంలో తగాదాలు జరుగుతుండేవి.ఈ క్రమంలో మంగళవారం భూమి వద్ద వ్యవసాయనీటి పైపు విషయంపై తగాదా జరిగింది. ఈ తగాదాలో కోటేశ్వరరెడ్డిపై కర్రలు, రాళ్లతో బంగారాజు కుటుంబసభ్యులు దాడిచేయడంతో ఆయనకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో కోటేశ్వరరెడ్డిని కుటుంబసభ్యులు సాలూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడినుంచి విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోటేశ్వరరెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

దుస్తుల వితరణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్రీవేణుగోపాల మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సీహెచ్ ఉషారాణి మంగళవారం దుస్తులు వితరణ చేశారు. ఇటీవల ఆమె రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోగా, ఆమెను గ్రామస్తులు ఉదయం సత్కరించారు. అనంతరం ఆమె తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన నూతన వస్త్రాలను అదే పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి


క్రికెట్ బ్యాట్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న దివ్యాంగులు పతకాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరఫున కలెక్టరేట్‌లో దివ్యాంగులకు క్రికెట్ కిట్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా తరఫున క్రికెట్ పోటీల్లో పాల్గొని నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడలో విజేతలుగా నిలిచి జిల్లా ఖ్యాతిని నిలపాలని కోరారు. జిల్లా క్రీడాధికారి ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి దివ్యాంగుల టీమ్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దత్తత అధికారికంగా తీసుకోవాలి

- బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హిమబిందు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: దత్తత అనేది అధికారికంగా తీసుకోవాలని బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు అన్నారు. ఈ మేరకు స్థానిక శిశుగృహలో మంగళవారం దత్తత తీసుకోవాల్సిన తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అనధికారిక దత్తత చెల్లదని స్పష్టం చేశారు. పెద్ద పిల్లలను దత్తత తీసుకుంటే పిల్లలు అందివస్తారని తెలిపారు. అనధికారిక దత్తత వల్ల ఎటువంటి హక్కులు పిల్లలు పొందలేరన్నారు. అధికారిక దత్తత తీసుకున్న పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఓ ఎన్ఐసీ బి. రామకోటి, శిశుగృహ మేనేజర్ త్రివేణి, చైల్డ్‌లైన్ సిబ్బంది మీనాకుమారి, అరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లౌకిక వాదాన్ని కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

- కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ నినాదాలు


కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న బీఎస్పీ కార్యకర్తలు

విజయనగరం అర్బన్: మతసామరస్యాన్ని పెంపొందించడానికి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ ఎదుట మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. తొలుత కలెక్టరేట్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పరిరక్షించే దిశగా పాలన అందించాలని కోరారు. రాజ్యాంగాన్ని నిర్మించుకుని గణతంత్ర రాజ్యాంగంగా పిలుచుకుంటూ 75 వసంతాలు పూర్తి చేసుకున్నామని అయినప్పటికీ దళిత, ముస్లిం మైనార్టీ, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. మతవాదుల విద్వేషవాదనల వల్ల హిందూయేతర దేవాలయాల స్థలాలు అక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కె.సోములు, కె.లక్ష్మి, మాణిక్యం, బీఎస్పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- కలెక్టర్‌కు జేఎల్‌ఎంల వినతిపత్రం


కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్ గ్రేడ్–2 వారిని సచివాలయం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో అత్యవసర పనులతో పాటు అనేకమైన విధులు నిర్వహిస్తుండగా అదనంగా సచివాలయం పనులు అప్పగించడం వల్ల ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో ఉన్నామన్నారు. విధి నిర్వహణలో కొంతమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. మరి కొంతమంది క్షతగాత్రులయ్యారని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు సురగాల లక్ష్మణ్, వంగపండు లక్ష్మణరావు, టి. గంగునాయుడు. ఎస్.పైడిరాజు, గుమ్మడి దేముడు, గనివాడ అప్పలనాయుడు, భోగి సూరి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న గిరిజన యూనివర్సిటీ వీసీ టీవీ కట్టిమణి, ఉర్దూ యూనివర్సటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మహ్మద్ మియాన్


జేఎన్‌టీయూ జీవీలో తరగతి గదిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో మంగళవారం ఘనంగా జరిగింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉర్దూ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మహ్మద్ మియాన్ హాజరయ్యారు. తొలుత విద్యార్థులతో రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భారత రాజ్యాంగం మీద విద్యార్థులకు నిర్వహించిన వివిధ కళాంశాల పోటీల విజేతలకు ముఖ్యఅతిథి జ్ఞాపికలు అందజేశారు. ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుసుమ్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్స్ ప్రొఫెసర్ శరత్‌బాబు, ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, కంట్రోలర్ ఆఫ్ ఎకనామినేషన్స్ ప్రొఫెసర్ కివాడే, వివిధ విభాగాల అధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో..
పట్టణంలోని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జేఎన్‌టీయూజీవీ) వర్సిటీలో రాజ్యాంగ ఆమోద దినత్సోవం ఘనంగా జరిగింది. తొలుత తరగతి గదుల్లో విద్యార్థులతో రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జీజేనాగరాజు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనపై నిరసన


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, రైతులు

విజయనగరం అర్బన్: నిరంకుశ పాలనావిధానాలు విడనాడకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా శాఖ నాయకులు హెచ్చరించారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు విజయనగరం కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. కేంద్రంలో బీజేపీ బాటలోనే రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలన తీరు ఉందని విమర్శించారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా గత పదేళ్లలో కేంద్రప్రభుత్వం రూ.19 లక్షల 28వేల కోట్లు మేరకు రుణమాఫీ, పన్నురాయితీ, ప్రోత్సాహకాల పేరుతో ప్రజాధనాన్ని దోచిపెట్టిందని విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో 500 ప్రైవేటు కంపెనీలకు యాజమాన్యం ఇవ్వాల్సిన జీతాలను కేంద్ర ప్రభుత్వమే ఇంటర్న్ షిప్ పేరిట కార్మికుడికి నెలకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలను అందజేయాలని నిర్ణయించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. అత్యంత ధనికుల సంపద, వారసత్వ పన్నులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, రైతు కూలీ సంఘం (ఏపీ) రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పారావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాములు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు పాల్గొన్నారు.